క్లుప్తంగా

సందడిగా ముందస్తు విజయదశమి పండుగ



పెనమలూరు: కానూరు భాష్యం పాఠశాలలో ముందస్తుగా దసరా పండుగను విద్యార్థులు నవ దుర్గాదేవి అవతారాలతో అలరించి సందడి చేశారు. దసరా పండుగ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఆకట్టుకునే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, కోలాటం నాటికలు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జోషి దసరా పండుగ, సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ బ్యూలా, ప్రిన్సిపాల్ శైలజ, హెచ్ఎం రేష్మ, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మహాచండీ హోమం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని పంచతత్వ గురుపాదుకా మందిరంలో ఆదివారం మహాచండీ హోమం నిర్వహించారు. తొలుత గురుపాదుకాలకు అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. అనంతరం దత్తాత్రేయ స్వామివారికి తైలాభిషేకం చేశారు. అంజనేయశర్మ, ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో చంద్రశేఖర్ దంపతులచే మహాచండీ, మహా మృత్యుంజయ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని సమర్పించారు. ఆశ్రమ ట్రస్టీ గొంది రాజశేఖర్, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ పితృదేవోభవ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు జూలూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాలయ పక్ష అమావాస్యను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. వాసవీ జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సహకారం, మహిళలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరి వుడత్తు నరేంద్ర, పేరూరి రామ్మోహనరావు, పెరుమాళ్ల మణికంఠ, అత్తులూరి సుబ్రహ్మణ్యం, హరిష్, జూలూరు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నడకతోనే ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సాధ్యమైనంతగా నడవడం అలవాటుగా చేసుకోవాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి, డిస్ట్రిక్ట్ వాకర్స్ గవర్నర్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక గులాబీతోట అమరావతి వాకర్స్ క్లబ్‌లో ఆదివారం వారు వాకర్స్ పతాకాన్ని ఎగురవేసి క్లబ్ వ్యవస్థాపకులు సుంకరి ఆళ్వార్ దాస్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వాకర్స్ నాయకులు కొండాయగుంట రాము, బందారు కొండ, యర్రంశెట్టి శ్రీను, గంగాధర్, శ్రీనివాస రాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్వాములు ఆక్రమించిన భూములపై అసెంబ్లీలో చర్చ జరపాలి

హేతువాద సంఘం డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ భూములను ఆక్రమించిన దొంగస్వాముల వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ జరపాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాతికేళ్లుగా కొందరు దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించి పెద్ద పెద్ద కట్టడాలు నిర్మించినట్టు తెలిపారు. ఆశ్రమాల పేరుతో యజ్ఞయాగాలు, దీక్షలు చేస్తూ ప్రజలను, ప్రభుత్వాన్ని రకరకాలుగా మోసం చేస్తున్నారని, ఈ విషయాలన్నింటిపై అసెంబ్లీలో చర్చపెట్టి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తి సత్యసాయిబాబు శత జయంతి వేడుకలు ప్రభుత్వమే జరపాలని నిర్ణయించడం సరికాదన్నారు. ప్రభుత్వమే ఇలాంటివి చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు దొంగరామదూత ఆక్రమించిన కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములపై తప్పనిసరిగా చర్చ జరపాలని నార్నె వెంకటసుబ్బయ్య కోరారు.

ఎంపీపీ స్కూల్‌కు ఎన్ని కష్టాలో!

- కోడూరుపాడు ఎంపీపీ స్కూల్‌కు సొంత భవనం కరువు
- మూడేళ్లుగా అద్దె భవనాల్లోకి మారుతూ అవస్థలు



కోడూరుపాడులో ఆర్సీఎం భవనంలో కొనసాగుతున్న ఎంపీపీ స్కూల్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం లేకపోవటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. గత మూడేళ్లుగా పలు అద్దె భవనాల్లోకి మారుతూ ఇక్కట్లు పడుతున్నారు. పాఠశాలకు సొంత భవనం సమకూర్చాలని కోరుతూ గ్రామస్తులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తులు చేసినా ఫలితం దక్కటం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న భవనం గడువు మరో ఐదు నెలలు మాత్రమే ఉండటంతో గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

మూడేళ్ల క్రితం ఎంపీపీ స్కూల్ ఏర్పాటు

గ్రామంలోని ఆర్సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను మూసి వేయటంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంజూరు చేసింది. కానీ భవనం లేకపోవటంతో కొద్దిరోజుల పాటు గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. కానీ అక్కడే గ్రామ పంచాయతీకి సంబంధించిన బ్లీచింగ్, ఇతర సామగ్రి కూడా భద్రపర్చటంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. దీంతో అక్కడ నుంచి మరో అద్దె భవనంలోకి ఎంపీపీ స్కూల్‌ను మార్చారు. ఇంటి యాజమానికి సక్రమంగా అద్దె చెల్లించకపోవటంతో కొద్ది నెలలకే ఆ భవనం కూడా ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో గ్రామస్తులు ఆర్సీఎం బిషప్‌ను ఆశ్రయించారు. గతంలో గ్రామంలో నిర్వహించిన ఆర్సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను మూసి వేయటంతో ఖాళీగా ఉన్న భవనాలను ఎంపీపీ స్కూల్ నడుపుకునేందుకు అనుమతి కోరారు. రెండేళ్ల పాటుగా ఎలాంటి అద్దె చెల్లించకుండా ఆర్సీఎం బిల్డింగ్ వినియోగించుకునేందుకు బిషప్ అనుమతిఇచ్చారు. ఈవిద్యా సంవత్సరం ము గింపుతో గడుపు ముగియనుంది.



ప్రజాప్రతినిధులకు పట్టేనా?

గ్రామంలో కొత్తగా మంజూరైన ఎంపీపీ స్కూల్‌కు సొంత భవనం సమకూర్చాలని పలుమార్లు అధికార కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, విద్య, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో పలుచోట్ల ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపితే సొంత భవనం ఏర్పాటు చేసుకోవచ్చని చెబుతున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అయినప్పటికీ అధికారులు మొద్దు నిద్ర పోతున్నారని విమర్శిస్తున్నారు.

సొంత భవనం లేక తగ్గుతున్న విద్యార్థులు

గ్రామంలో ఉన్న ఏకైక ప్రభుత్వ పాఠశాల ఇదే కావటం గమనార్హం. కనీసం సొంత భవనం లేకపోవటం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవటంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను ఆ పాఠశాలకు పంపించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో క్రమంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. గతంలో సుమారు 50 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 35కి పడిపోయింది. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవించే పేద వాళ్లు కూడా గత్యంతరం లేని పరిస్థితుల్లో అధిక ఫీజులు చెల్లించి ప్రైవేట్ స్కూళ్లకు బస్సుల్లో పంపుతూ ఆర్థికంగా సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉన్న ఒక్క ప్రభుత్వ పాఠశాల కూడా రద్దు అయ్యే ప్రమాదం ఉంది.

విద్యార్థులకు ఆసరా కల్పించండి



గ్రామంలో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ పాఠశాలకు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవటంతో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి, పాఠశాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలి.

– చందు శ్రీనివాసరావు, గ్రామస్తుడు

క్యాన్సర్‌పై విజయం సాధించాలి

మునిసిపల్ కమిషనర్ నజీర్

పెనమలూరు: క్యాన్సర్‌పై పోరాటం చేసి విజయం సాధించాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ నజీర్ అన్నారు. కానూరులో రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పండ్లు, చిన్నారులకు బొమ్మలు అందజేశారు. వరల్డ్ రోజ్ డే సందర్భంగా ఆదివారం అమెరికన్ అంకాలజీలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ నజీర్ మాట్లాడు తూ క్యాన్సర్ బాధితులు జీవితంలో పోరాడి గెలవాలని కోరారు. ధైర్యం, సంతోషం అనే ఆయుధాలతో పోరాటం చేయాలని, వీరికి సమాజం పూర్తి మద్దతు పలికి అండగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 100 మంది క్యాన్సర్ బాధితులకు గులాబీ పూలు, పండ్లు, బొమ్మలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులను సత్కరించారు. రూట్స్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్, లయన్స్ క్లబ్ ఆఫ్ తెలప్రోలు అధ్యక్షురాలు మోదుగు ఉమాదేవి, సర్వో డైమండల్ చైర్మన్ నెట్టెం శ్రీనివాస్, టీడీపీ నాయకుడు దోనేపూడి రవికిరణ్, క్యాన్సర్ వైద్యులు డాక్టర్ ఇషాంత్, డాక్టర్ పద్మజ, రూట్స్ సభ్యులు చందు శ్రీనివాస్‌శర్మ, వెంకటరమణ, శిరీషా, జయకామేశ్వరి, సంజయ్ పలువురు పాల్గొన్నారు.



క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి పండ్లు, బొమ్మలు అందజేస్తున్న కమిషనర్ నజీర్

రక్త దానం చేసిన బాడీబిల్డర్స్

పెనమలూరు: బాడీ బిల్డింగ్ క్రీడాకారులు రక్తదానం చేశారు. వరల్డ్ క్యాన్సర్ అవేర్‌నెస్ నెల సందర్భంగా ఉయ్ ఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్టు, కానూరు అశోక్‌జిమ్, మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ జిమ్‌లకు చెందిన బాడీ బిల్డింగ్ క్రీడాకారులు 10 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పండ్లు ఇచ్చి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మనోహర్, తాళ్లూరి అశోక్, ట్రస్టు చైర్మన్ అయ్యప్ప, పలువురు జిమ్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన క్రీడాకారుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అశోక్

నేత్రపర్వంగా సంగీత నృత్య సమ్మేళనం

విజయవాడకల్చరల్: శ్రీవాగ్దేవీ వాయిద్య సంగీత, నృత్య సంస్కృతీ సంస్థ ఆధ్వర్యాన లబ్బీపేటలోని శ్రీశారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన సంగీత నృత్య సమ్మేళనం నేత్రపర్వంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, నృత్య కళాకారులు, వాయిద్య కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకున్నారు. కూచిపూడి, భరతనాట్యం, మోహినీ అట్టం, జానపద అంశాలను ప్రదర్శించారు. వాయిద్య కళాకారుల బృందం నాటరాగంలో ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన మహాగణపతిం, త్యాగరాజస్వామి కీర్తన శ్రీరాగంలోని ఎందరో మహానుభావులు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని కీర్తన చూడరమ్మ సతులార కీర్తనలను పలికించారు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు డాక్టర్ రామ్మోహనరావు, సంస్థ నిర్వాహకుడు బి.నాగేంద్ర యాదవ్, తిరుమల తిరుపతి దేవస్థాన సంగీత కళాశాల అధ్యాపకుడు చంద్రశేఖర్ నృత్యోత్సవంలో పాల్గొన్న నాట్యాచార్యులను, చిన్నారులను సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.



నాట్యాచార్యుడు రాయన శ్రీనివాసరావును, చిన్నారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

భారీ వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం



మద్దూరు-గోసాల రోడ్డు మార్గంలో నిలిచిన వర్షపునీరు





గొడవర్రు రోడ్డు మార్గంలో నేలవాలిన వృక్షాలు

కంకిపాడు: భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ద్రోణి ప్రభావంతో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి వరకూ వర్షం కురవటంతో పాటుగా ఈదురుగాలులు వీచాయి. దీంతో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. కంకిపాడు-రొయ్యూరు మార్గంలో అనేక చోట్ల చెట్లు నేలకూలాయి. విరిగిపడ్డ చెట్లు రాకపోకలకు అసౌకర్యంగా మారాయి. విద్యుత్ స్తంభాలు నేలవాలి, విద్యుత్ లైన్లు తెగటంతో సుమారు ఆరుగంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఉదయం వాతావరణం తెరిపిచ్చి తీవ్రమైన ఎండ కాచినా, సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతోకూడిన వర్షం కారణంగా రోడ్లపై ఎక్కడికక్కడ వర్షం నీరు నిలిచిపోయింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా మద్దూరు- గోసాల రోడ్డు మార్గం వర్షం నీటితో నిండిపోయి రాకపోకలు సజావుగా సాగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మున్సిపాలిటీ భవన నిర్మాణానికి స్థలం మంజూరు

పెనమలూరు: పోరంకిలో తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేశారు. గ్రామంలో చేపల కుండీల వద్ద ఉన్న దాదాపు 71 సెంట్ల గ్రామ కంఠం స్థలాన్ని తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణానికి కలెక్టర్ మంజూరు చేశారు.

వివరాలు ఇవీ..

తాడిగడప మున్సిపాలిటీ ఏర్పడి దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచినా నేటి వరకు కార్యాలయానికి సొంత భవనం లేదు. దీంతో పోరంకిలో గతంలో గ్రామ పంచాయతీ ఉన్న భవనంలో తాడిగడప యున్సిపాలిటీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ భవనం చాలా చిన్నదిగా ఉంది. పరిపాలనకు అనుకూలంగా లేక పోవటంతో మున్సిపాలిటీ ప్రజలతో పాటు, తాడిగడప మున్సిపాలిటీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్థలం సమస్య..

విజయవాడ నగరానికి తాడిగడప మున్సిపాలిటీ దగ్గరగా ఉండటంతో స్థల సేకరణ ఇంతకాలం సమస్యగా మారింది. గతంలో కానూరులో మున్సిపాలిటీకి భవన నిర్మాణం చేయాలని రూ.5 కోట్ల నిధులతో ప్లాన్ చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. కాగా త్వరలో మున్సిపాలిటీ ఎన్నికలు జరిగితే దాదాపు 38 మంది కౌన్సిలర్స్‌తో పాలన ఎలాసాగించాలనేది సమస్య. దీంతో స్థల సేకరణ పనిలో పాలకులు పడ్డారు. పలు స్థలాల పరిశీలన అనంతరం చివరకు పోరంకి చేపల కుండీల వద్ద 71 సెంట్ల స్థలానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

ప్రభుత్వ అనుమతుల కోసం..

ప్రస్తుతం తాడిగడప మున్సిపాలిటీ నిర్మాణం చేసేందుకు ఎంపిక చేసిన స్థలానికి ప్రభుత్వం కూడా ఆమోదించాల్సి ఉంది. ఈ మేరకు సంబంధిత ఫైల్ తాడిగడప యున్సిపాలిటీ కమిషనర్ ఎస్‌కే నజీర్ సిద్ధం చేశారు. ప్రభుత్వం ఆమోదించిన తరువాత మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులు చేపడతామని కమిషనర్ నజీర్ తెలిపారు. నూతన భవన నిర్మాణం జరిగితే తాడిగడప మున్సిపాలిటీ అన్ని హంగులతో ప్రజలకు సేవలు అందించటానికి అవకాశం ఉంటుంది.



పోరంకిలో మున్సిపాలిటీ భవన నిర్మాణం చేయనున్న స్థలం

ముందుకు సాగని రోడ్డు విస్తరణ పనులు

గన్నవరం: స్థానిక గన్నవరం– ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్న ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, వర్షాల కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో అసంపూర్తిగా ఉన్న ఈ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో విపరీతంగా దుమ్ము, ధూళి లేగుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి మార్కెట్ వరకు విస్తరించేందుకు మే నెలలో పనులు ప్రారంభించారు. తొలుత రహదారికి ఇరువైపులా సీసీ డ్రెయిన్లు, జాతీయ రహదారి పక్కన కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తిచేశారు. గతంలో ఉన్న సెంట్రల్ డివైడర్‌ను కొంతమేర తొలగించి కొత్తగా నిర్మాణం చేశారు. ఇటీవల రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన విద్యుత్ స్తంభాలను కూడా మార్పు చేశారు. విస్తరించేందుకు సిద్ధం చేసిన రహదారిపై బీటీ రోడ్డు నిర్మాణంలో మాత్రం తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. దీంతో రహదారి నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా బలోపేతానికి వేసిన ఫ్లైయాష్ గాలికి లేచి పక్కనే ఉన్న దుకాణాలు దుమ్ము కొట్టుకుపోతున్నాయని నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.



అసంపూర్తిగా ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు

నేటి నుంచి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విజయవాడలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ వద్ద భారీ వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అమలు చేయనున్నారు. విశాఖపట్టణం నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను హనుమాన్‌జంక్షన్ నుంచి గుడివాడ, పామర్రు మీదగా ఒంగోలు హైవేకు మళ్లిస్తున్నట్టు చెప్పారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్



హనుమాన్‌జంక్షన్ రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులకు ఆదివారం ఎస్ఐ శ్రీనివాస్ కౌన్సెలింగ్ నిర్వహించారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సత్ప్రవర్తనతో నడుకోవాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా సహించబోమని ఎస్ఐ హెచ్చరించారు.

చోరీల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

దసరా సెలవులకు పొరుగు గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇళ్లల్లో దొంగతనాలను నివారించేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. పండుగ సెలవులకు ఇంటికి తాళం వేసి ఊళ్లు వెళ్లే వాళ్లు పాటించాల్సిన పలు జాగ్రత్తలను ఆయన ఆదివారం వివరించారు. తమ విలువైన బంగారు ఆభరణాలు, ఖరీదైన వస్తువులను ఇంట్లో విడిచిపెట్టవద్దని, బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ఇంట్లో లైట్లు ఆన్ చేసి వెళ్లాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఇంటి చుట్టుపక్కల వాళ్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటూ ఉండాలన్నారు. అవసరమైతే ఇంటి ప్రాంగణంలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు



యనమలకుదురు ఆలయం




కంకిపాడు శివాలయం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వస్వామివారి దేవస్థానంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఈవో ఎస్.భవాని తెలిపారు. ఆమె ఆదివారం వివరాలు తెలుపుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దివ్య అలంకరణ చేస్తామన్నారు. 22న శైలపుత్రిదేవి, 23న బ్రహ్మచారిణిదేవి, 24న చంద్రఘంటదేవి, 25న కూష్మాండ దేవి, 26న స్కందమాతాదేవి, 27న కాత్యాయినిదేవి, 28న కాళరాత్రిదేవి, 29న మహాగౌరీదేవి, 30న సిద్ధిధాత్రిదేవి, ఒకటో తేదీన రాజరాజేశ్వరిదేవి, 2న రజతకవచదేవి అలంకరణ చేస్తామన్నారు.

కంకిపాడు: దసరా మహోత్సవాలకు కంకిపాడు శివాలయం ముస్తాబైంది. ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోనా భాస్కర్‌రావు, లక్ష్మీ దంపతులచే కలశ స్థాపనతో పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. ఈనెల 22న బాలా త్రిపుర సుందరీ దేవి, 23న శ్రీ గాయత్రీ దేవి, 24న శ్రీ అన్నపూర్ణాదేవి, 25న శ్రీ కాత్యాయని దేవి, 26న శ్రీ మహాలక్ష్మి దేవి, 27న శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి, 28న శ్రీమహాచండీదేవి, 29న మూలానక్షత్రం సందర్భంగా శ్రీసరస్వతీ దేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబరు 1న శ్రీమహిషాసుర మర్ధినిదేవి, 2న శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకోనున్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రూ.3.5 కోట్లతో శ్రీకనకదుర్గ ఆలయం పునర్నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రూ.3.5 కోట్ల వ్యయంతో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్టు దేవస్థానం అభివృద్ధి కమిటీ తెలియజేసింది. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. 250 గజాల స్థలంలో 30 అడుగుల ఎత్తులో అమ్మవారి రాతి గుడిని ఆగమశాస్త్ర ప్రకారం రాజేమహేంద్రవరం శిల్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్టు తెలిపారు. సుమారు 35 సంవత్సరాల క్రితం స్థానికులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారన్నారు. అదే స్థలంలో భక్తులు, దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. కమిటీ ప్రెసిడెంట్ గుంటక సంధ్యారాణి, కార్యదర్శి అంగజాల హనుమా, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సీతారామారావు, యర్కారెడ్డి మల్లారెడ్డి, ఎంపీటీసీ బొంతు సరోజిని, సభ్యులు దుంపలకృష్ణ, బాలాజీ నాయక్, రాంబాబు,అర్చకులు రొంపిచర్లదత్తుకుమార్, సుబ్రహ్మణ్యంరాజుపాల్గొన్నారు.